క్లుప్తంగా

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తవణంపల్లె: మండలంలోని సంతపల్లె, ద్వారకాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. సంతపల్లె హెల్పర్ పోస్టును ఎస్సీలకు, ద్వారకాపురం అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్ పోస్టును ఎస్సీలకు కేటాయించినట్లు వెల్లడించారు. అర్హులైన వారు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులను అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు ఐరాల సీడీపీఓ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు

ఐరాల: విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత తెలిపారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం, నీతి కథలు చదవడంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు సచివాలయ మహిళా పోలీసులు రుషికేశ్వరి, వీణ, కవిత అవగాహన కల్పించారు. ఆడపిల్లలు ఆత్మవిశ్వాసంతో ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఎలాంటి ఇబ్బందికర పరిస్థితి తలెత్తినా అది కచ్చితంగా తల్లితో చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీఆర్‌పీ మృతి


కామేశ్వరి(ఫైల్)

బంగారుపాళెం: స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ధనంజయ రాజు భార్య కామేశ్వరి (49) బుధవారం మృతి చెందారు. కామేశ్వరి యాదమరి మండలంలో సీఆర్‌పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో తమ స్వగృహంలో మృతి చెందారు. కామేశ్వరి మృతికి జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్ రాజా, స్థానిక సర్పంచ్ ఉమాదేవి, ఉపసర్పంచ్ కామరాజు తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

వైభవంగా గంగమ్మ నిమజ్జనం

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులపాటు గంగజాతరను ఉత్సాహంగా జరుపుకున్నారు. మండలంలోని తవణంపల్లె, టి.పుత్తూరు, దిగువ తడకర గ్రామాల్లో బుధవారం గంగమ్మ తల్లికి భక్తులు విశేష పూజలు చేశారు. అనంతరం గంగమ్మను మేళతాళాలు మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మ వారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.


నిమజ్జనం కోసం బయల్దేరిన గంగమ్మ

గెరిగలతో వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


ఊరేగింపును ప్రారంభిస్తున్న ఓంశక్తి భక్తుల సంఘం


కొంగారెడ్డిపల్లెలో ఊరేగింపుగా వెళుతున్న గంగమ్మ


అట్టహాసం.. నిమజ్జనోత్సవం

- చిత్తూరులో ముగిసిన గంగజాతర
- జలధికి చేరిన అమ్మవారు
- ఆకట్టుకున్న ఓం శక్తి భక్తుల విన్యాసాలు


అశేష భక్తజనుల మధ్య ఊరేగింపుగా నిమజ్జనానికి బయల్దేరిన నడివీధి గంగమ్మ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరంలో గంగజాతర వేడుకగా ముగిసింది. నిమజ్జనోత్సవం అర్ధరాత్రి వరకు అట్టహాసంగా సాగింది. అమ్మవారు జనసందోహం నడుమ జలధికి చేరారు. భక్తులు పసుపుపళ్లెంతో హారతులు పట్టారు. గజమాలలు సమర్పించారు. వినూత్న రీతిలో మొక్కులు చెల్లించుకున్నారు. ఓం శక్తి భక్తుల విన్యాసం అబ్బురపరిచింది. డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి. ఈ వేడుకలను తిలకించేందుకు జనం తరలివచ్చారు.

చిత్తూరు నగరంలో బుధవారం గంగమ్మ నిమజ్జనోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. జాతరలో భాగంగా మంగళవారం అమ్మవారిని ప్రతిష్ఠించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చివరిరోజైన బుధవారం సాయంత్రం వంశపారంపర్య ధర్మకర్త సీకేబాబు తమ వంశపారంపర్యంగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి సారెను సమర్పించారు. గ్రామదేవత అయినా పొన్నియమ్మ ఆలయంలో సారెకు పూజలు చేసి స్థానిక బజారువీధి వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ ప్రతిష్ఠించిన అమ్మవారికి అలంకరింపజేశారు. గజమాల సమర్పణతో అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభమైంది. డప్పు వాయిద్యాలు, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్న పెద్ద తేడా లేకుండా డప్పుకనుగుణంగా దరువు చేస్తూ పలువురు ఉత్సాహంగా కనిపించారు.

భక్తి శ్రద్ధలతో ఓం శక్తి భక్తుల విన్యాసాలు

సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు నగరంలోని ఓంశక్తి భక్తులు స్థానిక అగస్త్రీశ్వరస్వామి ఆలయంలో నుంచి హైరోడ్డులోని షాపింగ్‌మాల్ వరకు పలు విన్యాసాలు చేసుకుంటూ ఊరేగింపుగా చేరుకున్నారు. ఈ క్రమంలో భక్తులు తమ దవడలకు పదునైన శూలాలను గుచ్చుకుని, వీపులో కొక్కీలను గుచ్చుకుని, తాళ్లను కట్టుకుని బస్సులు, లారీలు, కార్లు, ఆటోలను లాగుతూ తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఓ భక్తుడు క్రేన్ సహాయంతో గాలిలో విహరిస్తూ, తన నోటి ద్వారా అమ్మవారి మెడలో పూలమాలను ధరింపజేశాడు. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన పాటకచ్చేరి భక్తుల్లో జోష్‌ను నింపింది. మంగళవారం తరహాలోనూ బుధవారం కూడా నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు జాతరకు వచ్చే భక్తులకు మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. పలువురు అన్నదానం చేశారు.

పోలీసుల పటిష్ట బందోబస్తు

రెండు రోజుల పాటు జరిగే చిత్తూరు గంగజాతరకు పోలీసు పటిష్ట బందోబస్తు కల్పించారు. అన్ని మండపాలను నిఘా నేత్రంలో పర్యవేక్షిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అడుగడుగునా పోలీసుల భద్రత బలగాలను దింపారు. దీంతో జాతర ప్రశాంతంగా ముగిసింది. నిమజ్జనోత్సవానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తుగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకున్నారు. భారీ వాహనాలను నగరంలోకి అనుమతించకుండా ఎక్కడికక్కడికి మళ్లించేశారు.

కట్టమంచి చెరువులో నిమజ్జనం

పాటకచ్చేరి ముగిసిన వెంటనే హైరోడ్డు మీదుగా అమ్మవారిని ఊరేగించారు. నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన కళాకారులు కోలాటాలు, నయ్యాండి మేళాలతో అమ్మవారి ముందు నడుస్తూ తమ భక్తిని చాటుకున్నారు. కొంత మంది యువకులు బాణసంచా పేల్చుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసీ కొత్త బస్టాండ్ సమీపంలోని కట్టమంచి చెరువులో నడివీధి గంగమ్మను నిమజ్జనం చేశారు. ఆ తర్వాత నడివీధిలో అఖండ జ్యోతిని కొండెక్కించారు. దీంతో చిత్తూరులో జాతర ఘట్టం భక్తిశ్రద్ధలతో ముగిసింది.

జలధికి బయల్దేరిన అమ్మవార్లు

నడివీధితో పాటు గిరింపేట, సంతపేట, దొడ్డిపల్లి, మురకంబట్టు, అగ్రహారం, మంగసముద్రం, కొంగారెడ్డిపల్లి ప్రాంతాల్లో కొలువుదీరిన గంగమ్మ కూడా రెండో రోజు గంగ ఒడికి చేరారు. జాతర పెద్దలు సంప్రదాయబద్ధంగా పూజలు చేసి అమ్మవారి జలధిని పూర్తి చేశారు. ఆయా ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలా అమ్మవారు ఊరేగుతూ ఇంటింటా కర్పూర హారతులు, విశేష పూజలు అందుకున్నారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, ఓంశక్తి భక్తుల విన్యాసాలు తదితర కార్యక్రమాలు స్థానికులను ఆకట్టుకున్నాయి.

ఓంశక్తి భక్తుల మొక్కు చెల్లింపు

ఓంశక్తి భక్తులు 500 మంది మొక్కులు చెల్లించుకున్నట్లు ఓం శక్తి భక్తుల సంఘం అధ్యక్షురాలు సరిత పేర్కొన్నారు. భక్తుల ర్యాలీని సంఘ సభ్యులు పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సభ్యులు ఆరుముగం రెడ్డి, గిరిజ, నాగయ్య, వినాయక, బాల తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి వేషధారణతో గంగమ్మ ప్రతిమను తీసుకొస్తున్న భక్తుడు


కొంగారెడ్డిపల్లెలో ఊరేగుతున్న గంగమ్మ



వీపునకు కొక్కీ గుచ్చుకుని వాహనాల్లో వేలాడుతూ మొక్కు చెల్లించుకుంటున్న ఓం శక్తి భక్తులు


బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసు

16న పుష్పపల్లకీ సేవ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఈనెల 16వ తేదీన దుర్గాంబ దేవస్థానంలో పుష్పపల్లకి సేవను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో మునిశేఖర్ తెలిపారు. గంగజాతర తరువాత వచ్చే శుక్రవారం గ్రామదేవత అయినా దుర్గాంబకు పల్లకి సేవ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ క్రమంలో 16న ఉదయం మహా చండీ హోమం, 1008 బిందెల గంగాజలంతో మహాభిషేకం, సాయంత్రం పసుపు అలంకారం ఉంటుందన్నారు. రాత్రి 9 గంటలకు దుర్గమ్మ పుష్ప పల్లకి సేవలో అత్యంత వైభవంగా ఊరేగుతారన్నారు. 17న కూడా ఈ సేవ కొనసాగుతుందని, ఇదే రాత్రి గ్రామోత్సవం ఉంటుందన్నారు. 18న వసంతోత్సవం ఉంటుందని భక్తులు విరివిగా పాల్గొనాలని ఆయన కోరారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో బృందావన్ ప్రతిభ


చరణ్‌కుమార్


తేజశ్రీ


రూబిని


సంతోష్

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని సంతపేట వద్ద ఉన్న బృందావన్ సీబీఎస్‌ఈ పాఠశాలలో పది, ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటారని చైర్మన్ శైలజాకుమారి తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. తమ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న రూబిని 500 మార్కులకు 473, సంతోష్ 467, జ్యోత్స్న, జయప్రసున్న 439, ధీరజ్ విఘ్నేష్ చౌదరి 415, మోనిష్ బాబు 411 మార్కులు సాధించారన్నారు. ఇంటర్మీడియట్‌లో చరణ్‌కుమార్ 500మార్కులకు 472, తేజశ్రీ 443, రెడ్డి కృష్ణప్రసాద్ 429, జీవన 428, ప్రణవ్ సాయి 411 మార్కులు సాధించినట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన ఆ విద్యార్థులను అభినందించారు.

ముగిసిన బ్రహ్మోత్సవం

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు బుధవారం శ్రీవారి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవి భూదేవి సమేతంగా స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సమయంలో అర్చక, పరిచారకులు, అధికార, అనధికారులు, భక్తుల కారణంగా తెలిసో తెలియకో చేసిన దోషాలు ఏవైనా ఉన్న పక్షంలో వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం చేసినట్టు అర్చకులు తెలిపారు. అశేష సంఖ్యలో భక్తులు పుష్పయాగాన్ని వీక్షించి పులకించారు. కంకణబట్టార్ నరసింహాచార్యులు, టీటీడీ డిప్యూటీ స్పెషల్‌గ్రేడ్ ఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

అకాల వర్షాలు.. అన్నదాత కుదేలు

- వరి పంట నూర్పిడికి ఇబ్బందులు
- పొలాల్లోనే తడుస్తున్న వరిగడ్డి


దిగువ మోదలపల్లె దగ్గర పొలంలోనే తడిసి మగ్గుతున్న వరిగడ్డి

తవణంపల్లె: అతివృష్టి, అనావృష్టితో రైతులు పండించిన పంటలు చేతికి అందక నష్టాలపాలవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే సమయంతో వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా రైతన్నలు కుదేలవుతున్నారు. రబీలో మండలంలో సుమారు 420 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఇందులో సుమారు 70 శాతం మంది రైతులు పంట నూర్పిడి చేశారు. మిగిలిన రైతులు పంట ఒబ్బిడి చేసుకోవడానికి అకాల వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. పెనుగాలుల ప్రభావంతో మామిడి కాయలు రాలి నేలపాలవుతున్నారు. వరి పంట నేలమట్టమవుతుంది. అకాల వర్షాలతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి అందక నష్టాలను మిగిల్చుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా వరి దిగుబడి

రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు మేరకు పంటలు సాగు చేయడంలో ఆశాజనకంగా వరి పంట దిగుబడి వచ్చింది. రబీలో సాగు చేసిన వరి పంట ఎకరాలకు సుమారు 40 నుంచి 44 బస్తాలు దిగుబడి వచ్చింది. పండించిన పంటను ఒబ్బిడి చేసుకోక ముందే ప్రకృతి వికృతి రూపం దాల్చడంతో రైతులు తీవ్రంగా నష్టాలు చవి చూస్తున్నారు. కొంత మంది రైతులు వరినూర్పిడి యంత్రాలతో పంటను కోసి వేశారు. రైతులు వడ్లను ఎండబెట్టు కోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. అకాల వర్షాలు కారణంగా వరిగడ్డి ఎండక పొలాల్లోనే మగ్గుతున్నాయి. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడనుంది. ప్రతి రోజు సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడడంతో పొలాల్లోనే వరిగడ్డి తడిసి మగ్గుతున్నది.

ప్రభుత్వం కొనుగోలు చేయాలి

మండలంలో పండించిన వరి పంటను ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలి. పండించిన వరి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. మండలంలో సుమారు 17,640 టన్నుల విత్తనాలను రైతులు పండించారు. ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించి పండించిన వరి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వరి పంటను ఒబ్బిడి చేసుకోవాలి



మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంట ఆశించిన మేరకు దిగుబడి వచ్చింది. కానీ రైతులు వర్షాలను దృష్టిలో ఉంచుకొని పంటను ఒబ్బిడి చేసుకోవాలి. మండలంలో 80 శాతం మేరకు పంటను ఒబ్బిడి చేశారు. వరి పంట కొనుగోలు కోసం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రతిపాదనలు పంపుతాం. రైతులు నష్టపోకుండా పంటను ఒడుపుకోవాలి.

- జి.ప్రవీణ్, వ్యవసాయాధికారి, తవణంపల్లె

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు


అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గుడిపాల: బాల్య వివాహాలతో అనేక అనర్థాలు జరుగుతాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలతాదేవి అన్నారు. మండల పరిధిలోని మొగరాళ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ప్రొజెక్టర్ ద్వారా బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఇంట్లో ప్రతి అమ్మాయికి చదువులు చెప్పించాలని, అప్పుడే వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ యువశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు గౌతమి, సోని, శశికళ పాల్గొన్నారు.

వేడుకగా అర్జున తపస్సు


తపస్మాన్ ఎక్కుతున్న అర్జున వేషధారి

గుడిపాల: మండలంలోని వసంతాపురంలో కొనసాగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్మాన్ కార్యక్రమం వేడుకగా సాగింది. శ్రీ వెంకటేశ్వర నాట్య కళామండలికి చెందిన అర్జున వేషధారి తపస్మాన్ చెట్టులోని మెట్టుకో పద్యం చెబుతూ అధిరోహించారు. సంతానం లేని మహిళలు తపస్సు మానువద్ద ఒరపడ్డారు. అర్జున వేషధారి తపస్సు మానుమీద నుంచి పూలు, నిమ్మకాయలు, వీబూది పండ్లు విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడ్డారు.